
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 2 జనవరి 2025



ఉద్యాన మేళాకు తరలిరండి

యాచారం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బొల్లారంలో ఈనెల 2న జరగనున్న ఉద్యాన మేళాకు యాచారం మండలంలోని రైతులను తరలించనున్నట్లు మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాచారం, మాల్ నుంచి మూడు వాహనాలను అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

రూ. 207కోట్లు తాగేశారు!

న్యూ ఇయర్‌కు జోరుగా మద్యం అమ్మకాలు

ఉమ్మడి జిల్లాలో మూడు రోజుల్లో రికార్డు

సర్కారుకు దండిగా ఆదాయం

216 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు



గత మూడు రోజుల్లో మద్యం అమ్మకాలు

ఐఎంఎల్ కేసెస్ 1,74,166

బీర్ కేసెస్ 2,03,609

అమ్మకాలు (రూ.కోట్లలో) 207.95

న్యూ ఇయర్ వేడుకలు ఫుల్లు కిక్కెకించాయి. డిసెంబర్ 31న యువత మత్తులో మునిగి తేలారు. గ్రాండ్ సెలబ్రేషన్‌లో భాగంగా ఉమ్మడి జిల్లాలో జోరుగా మద్యం అమ్మకాలు జరిగాయి. తగ్గేదేలే అంటూ మద్యం ప్రియులు తెగ తాగేశారు. బీర్లను ఎక్కువగా కొనుగోలు చేశారు. మూడు రోజుల పాటు జరిగిన అమ్మకాలతో సర్కారుకు దండిగా ఆదాయం సమకూరింది.



రంగారెడ్డి అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొత్త సంవత్సరం వేడుకల నేపథ్యంలో మద్యం అమ్మకాల్లో తెలంగాణలోనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సరికొత్త రికార్డును సృష్టించింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అమ్మకాలు స్వల్పంగా తగ్గాయి. గత ఏడాది న్యూ ఇయర్ సందర్భంగా డిసెంబర్ 29 నుంచి 31 వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రూ.208.24 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరగగా, ఈ సారి ఆ మూడు రోజులు రూ.207.95 కోట్ల విక్రయాలు జరిగాయి. పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో మద్యం షాపులు మూడు రోజుల పాటు కిటకటలాడాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, దాబాలు, ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లలో మద్యం ప్రియులు తాగడంలో ఏమాత్రం తగ్గలేదు. ఐఎంఎల్ కేసులకు సంబంధించి గత ఏడాది 1,80,196 కాటన్లు అమ్ముడు పోగా, ఈ సారి 1,74,166 కాటన్లు అమ్ముడు పోయాయి. గత ఏడాదితో పోలిస్తే ఐఎంఎల్ కేసెస్ కాస్త తగ్గాయి. ఇక బీరు మాత్రం జోరందుకుంది. గత ఏడాది

మిగతా 7వ పేజీలో...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి తీపి కబురు చెప్పారు. నూతన సంవత్సర కానుకగా మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో పొడగింపుపై ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే నగర శివారులోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు కందుకూరు, హయత్‌నగర్ ప్రాంతాలకు మెట్రో లైన్ పొడిగిస్తూ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఉత్తర భాగానికి కూడా మెట్రో కావాలనే డిమాండ్ రావడంతో దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. దీంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నార్త్ సిటీలోనూ మెట్రో పరుగులు

మేడ్చల్, శామీర్‌పేట్ వరకు పొడిగింపు

నూతన సంవత్సర కానుకగా సీఎం రేవంత్ ప్రకటన

డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు

త్వరలో నార్త్‌సిటీలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

ఊపందుకోనున్న రియల్ ఎస్టేట్ రంగం

హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు



6

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ కాంగ్రెస్ నేతలు తమ ప్రాంతానికి కూడా మెట్రో రైలు విస్తరించాలని సీఎంకు వినతి ఇవ్వడం, అంతకు ముందు అసెంబ్లీ సమావేశాల్లో మేడ్చల్ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందంటూ ఎమ్మెల్యే మల్లారెడ్డి కూడా ఆవేదన వ్యక్తం చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నూతన సంవత్సరం రోజు హైదరాబాద్ నుంచి మెట్రో రైలును మేడ్చల్, శామీర్‌పేటకు పొడిగించాలని అధికార ప్రకటన చేశారు. దీంతో నగరానికి ఉత్తర భాగంలోని ప్రాంతాలు మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోనున్నాయి. ప్యారడైజ్ నుంచి తాడ్‌బన్, సుచిత్ర, కొంపల్లి, కండ్లకోయ మీదుగా మేడ్చల్ వరకు 23 కి.మీ, జేబీఎస్ నుంచి కార్ఖానా, తిరుమలగిరి, అల్వాల్, హకీంపేట మీదుగా శామీర్‌పేట వరకు 22 కి.మీ వరకు రెండు కొత్త కారిడార్‌ల ఏర్పాటుకు

మిగతా 6వ పేజీలో...

ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్

మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో రైలు విస్తరణ పూర్తయితే నగరవాసులకు ట్రాఫిక్ ఇక్కట్లు తీరనున్నాయి. ప్రతీ రోజు వేలాది మంది ఈ ప్రాంతాల నుంచి నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చే వాహనాలతో ఎన్‌హెచ్-44, రాజీవ్‌రహదారిలు ట్రాఫిక్‌తో రద్దీగా మారుతుంటాయి. దీనికి తోడు ప్రస్తుతం ఎన్‌హెచ్-44లో బ్రిడ్జిల నిర్మాణ పనులు, శామీర్‌పేట రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కోసం భూ సేకరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. దీంతో గత కొంత కాలంగా మేడ్చల్, శామీర్‌పేట రహదారులు వాహనాల రద్దీతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మెట్రో విస్తరణతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగనున్నాయి.



చిలుకూరు బాలాజీ ఆలయ ఆవరణలో క్యూలో నిల్చున్న భక్తులు

నూతనోత్సాహం

కొత్త సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. న్యూఇయర్ రోజు కుటుంబ సమేతంగా సరదాగా గడిపారు. కొందరు ఆలయాలకు వెళ్లి పూజలు చేయగా.. మరికొందరు పార్కులు, పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. చిలుకూరు, మైసిగండి, నర్కూడ అమ్మపల్లి, ఎలికట్ట భవాని మాత ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. దైవ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరంలో అంతా శుభమే కలగాలని కోరుకున్నారు.

ఇందూరు ప్రీమియర్ లీగ్



నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన యువత

ఐపీఎల్ తరహాలో క్రీడాకారుల వేలం

సిద్ధమైన నాలుగు ఫ్రాంచైజీలు

సంక్రాంతి తర్వాత పోటీల నిర్వహణ

పెద్దేముల్ మండలం ఇందూరులో ఏర్పాట్లు

7

బట్టీల్లో బయోవేస్టేజ్

ఇటుకలను కాల్చేందుకు వినియోగం

కాలుష్యంతో రోగాల బారిన స్థానికులు!

అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆగ్రహం

6



పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి



శ్రీహరికి నియామకపత్రం అందిస్తున్న నరేందర్ రెడ్డి

కేశంపేట, జనవరి1(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ సత్తాచాటాలని కేశంపేట మండల సభ్యత్వ నమోదు కో కన్వీనర్లు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, కుమ్మరి మహేష్ పిలుపునిచ్చారు. బుధవారం కేశంపేట మండలంలోని పోమాల్‌పల్లి, ఇప్పలపల్లి, దేవునిగుడి తండా, చింతకుంటపల్లి గ్రామాలలో బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. పోమాల్‌పల్లి 124 బూత్ అధ్యక్షుడిగా మహేందర్, ఇప్పలపల్లి 112 బూత్ అధ్యక్షుడిగా శ్రీహరి, దేవునిగుడి తండా 113 బూత్ అధ్యక్షుడిగా శ్రీరాములు, చింతకుంటపల్లి 125 బూత్ అధ్యక్షుడిగా నవీన్‌లను ఎన్నుకొని నియమాక పత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు భక్తవత్సల్, అనెమోని పారేశ్, నరేందర్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

కందుకూరు : కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల శాఖ ఉపాధ్యక్షుడు సోమరాజు వెంకటేష్, జిల్లా నాయకులు గంగుల కృష్ణారెడ్డి కోరారు. బుధవారం గ్రామంలోని నాలుగు బూత్‌లకు సంబంధించి పార్టీ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేదునూరు గ్రామంలోని 459 బూత్ కమిటీలో అధ్యక్షునిగా పి.మహిపాల్‌రెడ్డి, 460 బూత్ కమిటీలో అధ్యక్షునిగా సిరిగిరి క్రాంతిచారి, 461 బూత్‌లో అధ్యక్షునిగా బి.ప్రవీణ్ యాదవ్, 463 బూత్‌లో అధ్యక్షునిగా నాయిన్ శివగౌడ్‌లను ఏకగ్రీకవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మైసయ్య, వీరస్వామి, వరుణ్‌కుమార్, కిషోర్‌చారి, ప్రవీణ్ యాదవ్, ప్రశాంత్‌రెడ్డి, రాజేష్, వంశీ, సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.









ఏకేఆర్ స్టడీ సర్కిల్‌లో ఉచిత అవగాహన సదస్సులు

వికారాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్, ఎస్ఐ, వీఆర్‌వో పోటీ పరీక్షలకు ఈనెల 3, 4, 5 తేదీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఏకేఆర్ స్టడీసర్కిల్ డైరెక్టర్లు బీవీ.రమణ, స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులకు రాష్ట్రస్థాయి అధ్యాపక బృందం హాజరవుతుందని, ఇంటర్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శివరాంనగర్ కాలనీలో హనుమాన్ ఆలయం పక్కన ఈతరగతులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9441022571 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.









పులిమామిడిలో వ్యర్థ పదార్థాలతో ఇటుకబట్టీలను కాలుస్తున్న వ్యాపారి



ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల బస్తాలు

బట్టీల్లో బయోవేస్టేజ్

- ఇటుకలను కాల్చేందుకు వినియోగం!
- అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆగ్రహం

కందుకూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఓ వ్యాపారి ఆస్పత్రుల నుంచి సేకరించిన వ్యర్థాలతో పాటు ప్లాస్టిక్‌ను ఇటుకల తయారీలో వాడుతూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఫలితంగా పరిసర ప్రాంతాల పంట పొలాలు కాలుష్యంతో దెబ్బతింటున్నాయి. అదేవిధంగా పశువులు మృత్యువాత పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సదరు వ్యాపారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర శివారులోని కందుకూరు మండలం పులిమామిడి గ్రామంలో నగరానికి చెందిన ఓ వ్యాపారి పదేళ్లుగా ఇటుకలను తయారు చేస్తూ వ్యాపారం సాగిస్తున్నాడు. అయితే, ఇటుక బట్టీని కాల్చడానికి గతంలో కట్టెలు వాడేవారు. కాగా, కందుకూరు, మహేశ్వరం మండలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో సదరు వ్యాపారి నగరంలోని పలు ప్రవేటు ఆస్పత్రుల్లో వృథాగా పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు(ఇంజక్షన్లు, గ్లౌజులు, ఇతరత్రా) బట్టీలో వాడుతున్నాడు. దాంతో పరిసర ప్రాంతంలోని పంట పొలాలు దెబ్బతింటున్నాయి. పశువులు తీవ్ర శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నాయి. ఈ విషయాన్ని గ్రహించిన రైతులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సదరు వ్యాపారి రాజకీయ నాయకుల అండదండతో వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను వాడటం మానుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

సదరు వ్యాపారి నగరం నుంచి గ్రామానికి ప్లాస్టిక్ వ్యర్థాలను తరలిస్తున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని స్థానికులు, రైతులు ఆరోపిస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను వాడొద్దని ప్రభుత్వం అవగాహన కల్పిస్తున్నా.. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ప్లాస్టిక్‌తో ఇటుక బట్టీలను కాల్చడం వల్ల గ్రామానికి చెందిన భట్టు అంజియాదవ్ ఆవు గర్భం దాల్చిన సమయంలో శ్వాసకోశ ఇబ్బందులు, ఇతర అనారోగ్య సమస్యలతో మృత్యువాత పడింది. అనంతరం రైతులు మృతిచెందిన ఆవు కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండటం చూసి అవాక్కయ్యారు. పులిమామిడి నుంచి మహేశ్వరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన సుమారు 10 ఎకరాల్లో కొనసాగిస్తున్న ఇటుక బట్టీని ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని రైతులు, పులిమామిడి గ్రామస్తులు కోరుతున్నారు.



ప్లాస్టిక్‌తో ఇటుక బట్టీలను కాలుస్తున్న స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామ కార్యదర్శి రాజుగౌడ్(ఫైల్)

పలుమార్లు నోటీసులు అందజేత

ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇటుక బట్టీలను కాలుస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పలు మార్లు నోటీలు ఇచ్చామని గ్రామ కార్యదర్శి రాజుగౌడ్ తెలిపారు. కొన్ని రోజుల వరకు కట్టెలతో ఇటుక బట్టీలను కాలుస్తున్నట్లు సమచారం ఉందని, అయితే, ఆ వ్యాపారి మాత్రం ప్లాస్టిక్ వ్యర్థాలను వాడటం మానుకోవడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

\- రాజుగౌడ్, కార్యదర్శి, పులిమామిడి

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇటుక బట్టీ నిర్వహిస్తున్నారని మండల, డివిజన్, జిల్లా స్థాయిలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఏ అధికారి సమస్యను పట్టించుకోవడం లేదు. గ్రామ కార్యదర్శి మాత్రం రెండు, మూడు సార్లు బట్టీల వద్దకు వెళ్లి నోటీసులు ఇవ్వడం తప్ప.. వ్యాపారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

\- పి.రమేష్, రైతు, పులిమామిడి

గ్రామాన్ని వదిలి వెళ్లాలా?



తమ గ్రామ సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇటుక బట్టీ నిర్వహిస్తున్న వ్యాపారి నిర్వాకంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులకు ఫిర్యాదు చేసినా.. వ్యాపారిపై చర్యలు తీసుకోవడంలేదు. వారి నిర్లక్ష్యంతో వ్యవసాయాన్ని వదిలి గ్రామం నుంచి ఎక్కడికైనా వలసపోవాలా? లేదా వ్యాపారిపై తగిన చర్యలు తీసుకుంటారా? మూగజీవాలు వింత రోగాల బారిన పడుతున్నాయి.

\- భట్టు అంజియాదవ్, రైతు పులిమామిడి

నార్త్ సిటీలోనూ మెట్రో పరుగులు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వెంటనే డీపీఆర్‌లు సిద్ధం చేసి కేంద్రానికి పంపించాలని బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

ఉత్తర తెలంగాణాకు అనుసంధానం

నార్త్ సిటీ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నార్త్ సిటీకి మెట్రోను విస్తరించాలని కొన్ని సంవత్సరాలుగా స్థానిక ప్రజల నుంచి డిమాండ్ వస్తున్నాయి. ఫోర్త్ సిటీకి మెట్రో లైన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదించినప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన నార్త్ సిటీ వైపునకు మెట్రో ఎందుకు విస్తరించరనే విమర్శలు వచ్చాయి. ఎట్టకేలకు నార్త్ సిటీ వైపునకు కూడా మెట్రో విస్తరించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఉత్తర తెలంగాణాకు నగరానికి కనెక్టివిటీగా ఉన్న జాతీయ రహదారులు 44, రాజీవ్ రహదారిలు మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాల మీదుగా నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాలకు చెందిన ప్రజలు వేలాది సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో విస్తరిస్తే నార్త్ సిటీ మరింత అభివృద్ధి చెంది, ప్రజలకు సౌకర్యవంతంగా మారనుంది.

గ్రేటర్ పరిధిలో కలిసే అవకాశం

మేడ్చల్ ప్రాంతంలో అనేక విద్యాసంస్థలతో పాటు పరిశ్రమలు, వివిధ రకాల కంపెనీలు ఉన్న దృష్ట్యా మెట్రో విస్తరణ జరిగితే వేలాది మంది ఉద్యోగులు, ఐటీ నిపుణులు, విద్యార్థులు, కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ మెట్రో విస్తరణ ప్రాజెక్టు పూర్తయితే మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలు గ్రేటర్ హైదరాబాద్‌తో అనుసంధానించబడుతాయి. గతంలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన మల్కాజిగిరి ప్రజలకు ఏదో ఒకటి తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చినట్లుగానే మెట్రో విస్తరణకు ఆదేశించడం పట్ల ఇక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరుగులు పెట్టనున్న అభివృద్ధి

మేడ్చల్, శామీర్‌పేటకు మెట్రో విస్తరణతో నార్త్ సిటీవైపు రియల్ ఎస్టేట్ రంగం మరింత పుంజుకుంటుందని రియల్ వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చెందిన నార్త్ సిటీ వైపు మెట్రో విస్తరణ జరిగితే మరింత అభివృద్ధి చెంది రియల్ ఎస్టేట్ కూడా పెరుగుతుందని భావిస్తున్నారు. మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో కూడా భూముల ధరలు పెరిగే అవకాశం ఉంది. దీనికితోడు కండ్లకోయలో ఏర్పాటు చేసిన ఐటీ హబ్ నిర్మాణం కూడా పూర్తయితే నార్త్ సిటీ అభివృద్ధి పరుగులు పెడుతుందని ఐటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎట్టకేలకు నూతన సంవత్సర వేళ ప్రభుత్వం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజలకు మెట్రో విస్తరణతో తీపి కబురు అందించింది.

అస్సాం పర్యటనలో బీజేపీ జిల్లా నాయకులు

మేడ్చల్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బృందం అస్సాం పర్యటన చేపట్టింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బీజేపీ అస్సాం రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రవీందర్ రాజుతో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పటిష్ఠతకు రాష్ట్రంలో చేపడుతున్న కార్యకలాపాలపై చర్చించారు. ఈ పర్యటనలో బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, సుదర్శన్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



రావీందర్ రాజుతో జిల్లా బీజేపీ నాయకులు



చెరువు ముందలి తండాకు బీటీ రోడ్డు



భూమి పూజ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామమైన చెరువు ముందలి తండాకు ఎట్టకేలకు బీటీ రోడ్డు మంజూరైంది.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బురాన్‌పూర్ దగ్గర బీటీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. బురాన్‌పూర్ గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తండాకు రోడ్డు సౌకర్యం లేక తండావాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బీటీ రోడ్డు మంజూరుతో తండావాసుల చిరకాల కోరిక నెరవేరింది. రోడ్డు నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.90లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, రాంచంద్రారెడ్డి, భీమయ్యగౌడ్, మల్లికార్జున్, రాజేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, సూర్యప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు.





కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి



కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న సందర్శకులు

ధారూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి కనిపించింది. నూతన సంవత్సరం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ప్రాజెక్టు ప్రాంతంలో ఎంజాయి చేశారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేసి సరదాగా గడిపారు.

సాగునీరు వృథా!



వృథాగా వెళుతున్న ప్రాజెక్టు బేబీ కెనాల్ నీరు

ధారూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి ప్రాజెక్టు బేబీ కెనాల్ నుంచి ఆయకట్టుకు పారే నీరు అడవిలోకి వృథాగా పోతోంది. ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు బేబీ కెనాల్ ద్వారా నీటిని వదిలారు. అయితే అడవిలోకి పారుతున్న నీటిని బుధవారం గమనించిన రైతులు సాగునీటి శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రాజెక్టు బేబీ కెనాల్ నుంచి బూర్గుగడ్డ వైపు వెళ్లే 3వ కల్వర్టు పగిలిపోయినట్లు గుర్తించారు. బేబీ కెనాల్ తూము షట్టర్ సరిగా పనిచేయడంలేదని షట్టర్ కిందకు పూర్తిగా దిగకపోవడంతో కెనాల్‌లో ఎక్కువ మొత్తంలో నీరు వెళుతుందని తెలిపారు. ఇలాగే నీరు వృథాగా పోతే యాసంగి పంటల సాగు కష్టమేనని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మార్చి చివరి వారంలో బీసీ గర్జన



ఆర్. కృష్ణయ్యను కలిసిన ఎం.లాల్‌కృష్ణ, బీసీ నేతలు

పరిగి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మార్చి చివరి వారంలో పరిగిలో లక్ష మందితో బీసీ గర్జన నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కోరినట్లు సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ తెలిపారు. నగరంలోని ఆయన నివాసంలో బుధవారం పరిగి నాయకులతో కలిసి ఆయనకు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీలకు దక్కాల్సిన రాజ్యాంగ హక్కుల గురించి చర్చించారు. జనాభా ప్రకారం బీసీలకు చట్ట సభల్లో అందాల్సిన వాటా గురించి చర్చించారు. పరిగిలో బీసీగర్జన నిర్వహణకు ఇప్పటి నుంచే ఏర్పాట్లపై సన్నాహాలు చేస్తామని తెలిపారు. కృష్ణయ్యను కలిసిన వారిలో సీనియర్ న్యాయవాది ఆనంద్‌గౌడ్, నాయకులు రాముయాదవ్, పి.చిన్ననర్సింహులు, కుడుముల వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

కేంద్ర హోంమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలి

మేడ్చల్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం మేడ్చల్ మండల కార్యదర్శి ఎం.నరేష్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వాఖ్యలను నిరసిస్తూ బుధవారం సీపీఎం నాయకులు మేడ్చల్‌లో నిరసన వ్యక్తం చేస్తూ అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ప్రశాంత్, నర్సింహ, కొమరయ్య, చంద్రశేఖర్, కె.నర్సింగ్ రావు, బాలకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాస్‌గౌడ్



తాండూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ లెక్చరర్ల అసోసియేషన్ వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు శ్రీనివాస్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. శ్రీనివాస్‌గౌడ్ తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యకు, రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వాష్‌రూంలో వీడియోలు తీశారంటూ విద్యార్థినుల ఆందోళన

కండ్లకోయ సీఎంఆర్ ఐటీ కళాశాల హాస్టల్‌లో ఘటన



హాస్టల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బాత్‌రూంలో ఉండగా విద్యార్థినుల వీడియోలు చిత్రీకరించే ప్రయత్నం చేసారంటూ సీఎంఆర్ ఐటీ గర్ల్స్ హాస్టల్ ఎదుట విద్యార్థులు బుధవారం రాత్రి పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. పరిస్థితి విషమంగా మారడంతో హాస్టల్‌లో పని చేసే సిబ్బంది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని పూర్తి విచారణ జరుపుతామని పోలీసులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. వివరాల ప్రకారం..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సీఎంఆర్ ఐటీ గర్ల్స్ హాస్టల్‌కు చెందిన విద్యార్థిని బుధవారం రాత్రి 8 గంటల సమయంలో హాస్టల్ వాష్ రూమ్‌కు వెళ్లగా వెంటి లేటర్ వద్ద ఎవరో వీడియో చిత్రీకరిస్తున్నట్టు అనుమానం వచ్చి తోటి స్నేహితులకు తెలిపింది. దీంతో అక్కడే ఉన్న విద్యార్థినులు ఈ విషయం పట్ల హాస్టల్ నిర్వాహకులకు తెలుపగా వారు సరైన రీతిలో స్పందించలేదు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు నిరసన చేపట్టి వీడియోలు చిత్రీకరించిన వారి పట్ల చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయం తెలుసుకున్న అక్కడే ఉన్న మిగితా హాస్టల్ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు గర్ల్స్ హాస్టల్ వద్దకు చేరుకుని విచారణ జరపాలని సిబ్బందిని నిలదీశారు. పరిస్థితి విషమించడంతో హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హాస్టల్‌కు చేరుకున్న పోలీసులు విద్యార్థులను సముదాయించి, హాస్టల్‌లో విచారణ చేపట్టారు. హాస్టల్‌లో ఉన్న సిబ్బంది వీడియోలు తీశారంటూ విద్యార్థులు ఆరోపించడంతో అక్కడ పని చేసే వారి సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు శాంతించి అక్కడి నుంచి వెళ్లారు. విచారణ చేస్తున్నామని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఇందూర్ ప్రీమియర్ లీగ్

నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన గ్రామీణ యువత



- ఐపీఎల్ తరహాలో క్రీడాకారుల వేలం
- సిద్ధమైన నాలుగు ఫ్రాంచైజీలు
- సంక్రాంతి తర్వాత పోటీలు నిర్వహణకు ఏర్పాట్లు

ఇలా నిబంధనలు

- ఒక్కో జట్టులో సొంత గ్రామం ఇందూరుకు చెందిన వారు 11మంది క్రీడాకారులు ఉండాలి.
- 11మందితో కూడిన జట్టును తయారు చేసుకునేందుకు ఒక్కో ఫ్రాంచైజీ కేవలం రూ.15వేలు మాత్రమే ఖర్చు చేయాలి.
- అవసరమనుకుంటే అదనపు వ్యయంతో ఫ్రాంచైజీ తాహత్తుకు అనుగుణంగా ఇతర ప్రాంతాల నుంచి నలుగురు క్రీడాకారులను కొనుగోలు చేసుకోవచ్చు.
- బయటి నుంచి కొనుగోలు చేసిన వారి లో ఒక ఆటలో ఇద్దరు మాత్రమే ఆడాల్సి ఉంటుంది.
- ఒక్కో ఫ్రాంచైజీ ఐపీఎల్ కమిటీకి రూ.5వేలు చెల్లించాలి.
- ఫ్రాంచైజీ కొనుగోలు చేసే క్రీడాకారుడిని బట్టి ఆల్‌రౌండర్‌ను కొనుగోలు చేస్తే కమిటీకి రూ.1వేయి, బ్యాట్స్‌మెన్ అయితే రూ. 750, బౌలర్ అయితే రూ.500 చొప్పున ఐపీఎల్ కమిటీకి చెల్లించాల్సి ఉంటుంది.



ఇందూరు గ్రామంలో ఐపీఎల్ మ్యాచ్‌లకు క్రీడాకారుల వేలం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

పెద్దేముల్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో జరిగే క్రికెట్ పోటీలు ఎప్పుడు చూసినా ఏదో ఒకరి పేరున మెమోరియల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తుంటారు. ఎవరికి వారు జట్టుగా ఏర్పడి పోటీల్లో పాల్గొంటారు. కానీ అందుకు పూర్తి భిన్నంగా ఐపీఎల్ తరహాలోనే కొందరు ఫ్రాంచైజీలుగా ఏర్పడి క్రీడాకారులను వేలంలో కొనుగోలు చేసి జట్టు తయారు చేస్తున్నారు ఇక్కడ. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం ఇందూరు గ్రామంలో గ్రామీణ ప్రాంత క్రికెట్ పోటీల్లో యువకులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఐపీఎల్ తరహాలోనే ఇందూరు ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి తరహాలో క్రికెట్ పోటీలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో కూడా ఆసక్తి పెరిగే అవకాశం ఉంటుంది. యువకుల ఆసక్తిని గమనించిన గ్రామస్తులు, యువకులు ముందుకు వచ్చి ఇందూరు ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అందుకోసం ఐదుగురు వ్యక్తులతో కలిసి ఐపీఎల్ కమిటీని నియమించుకున్నారు. క్రీడాకారులను జట్టుగా ఏర్పాటు చేసుకునేందుకు నలుగురు ఫ్రాంచైజీలు కూడా సిద్ధమయ్యారు. అయితే ఫ్రాంచైజీలకు కమిటీ తరఫున కొన్ని నిబంధనలు విధించారు.

ఇలా నిబంధనలు సిద్ధం చేసుకుని ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు ఇందూరు గ్రామంలో యువత సిద్ధమవుతున్నారు. అందుకోసం ఆదివారం నుంచి వేలం కూడా ప్రారంభించారు. ఇందూరు ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) పేరుతో మ్యాచ్‌లు నిర్వహించేందుకు గ్రామానికి చెందిన కుర్వబాలు, బుర్హాపూర్‌వెంకట్, వి.మహేష్, నవీన్, చంటి ఐపీఎల్ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రీమియర్ లీగ్ పోటీల్లో తలపడేందుకు కొంతమంది నాలుగు ఫ్రాంచైజీలు ఏర్పాటు చేసుకున్నారు. వారు ఆర్‌సీబీఎస్, రాయల్ వారియర్స్ ఎస్ఎస్ బ్రదర్స్ సన్‌రైజర్స్ పేర్లతో ముందుకు వచ్చారు. సంక్రాంతి పండగ తరువాత మ్యాచ్‌లు నిర్వహించేందుకు ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్నారు.

ఈ పోటీల ద్వారా ప్రతిభ మెరుగుపడుతుంది



క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ రకమైన క్రికెట్‌పోటీలు చాలా ఉపయోగపడతాయి. ఈ ఏడాది తక్కువరేటు పొందిన క్రీడాకారుడు తాను వచ్చే ఏడాది ఎక్కువ ధర పొందాలని తపన పడే అవకాశం ఉంటుంది. నిరంతర సాధన చేసి క్రీడల్లో తన ప్రతిభకు తానే మెరుగుపరుచుకునే అవకాశం ఏర్పడుతుంది. వేలంలో కొనుగోలు చేయడం వల్ల వారిలో కసి పెరిగి ఆటలో మరింత పట్టు సాధిస్తారు. ఇందూరులో నిర్వహించే ఇందూరు ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ల వల్ల ఇందూరు గ్రామంలో చాలా మంది క్రికెట్ క్రీడాకారులు తయారవుతారు. - కుర్వబాలు (ఇందూరు)

నలుగురం కలిసి ఫ్రాంచైజీగా ఏర్పడ్డాం



మా గ్రామానికి చెందిన క్రీడాకారుల ను ప్రతిభ కలిగిన వారిగా తీర్చిదిద్దే అవ కాశం కలుగుతుందని ఐపీఎల్ తరహా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నాం. నాతో పాటు ముగ్గురు మిత్రులం కలిసి ఒక ఫ్రాంచైజీగా ఏర్పడ్డాం. తాము పెట్టిన పెట్టుబడికి లాభాలు రావని తెలిసినా మా ఊరి యువకులు వారి ఆట తీరును మెరుగుపరుచుకునేందుకు ముందుకు వచ్చాం. మమ్మల్ని చూసి ఇతరులు కూడా ఇలాంటి క్రీడలు నిర్వహించేందుకు ముందుకు వచ్చే అవకాశం కలు గుతుంది. - బాల్‌రాజ్, ఫ్రాంచైజీ ఓనర్, ఇందూరు



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, వీర్లపల్లి శంకర్, మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్




పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చీఫ్‌విప్, ఎమ్మెల్యేలు

తాండూరు/నవాబుపేట/పరిగి/షాద్‌నగర్/చేవెళ్ల/షాబాద్/శంషాబాద్ రూరల్ జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. అదేవిధంగా సీఎంను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లో గల ఆయన నివాసంలో కలిసి కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, వీర్లపల్లి శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్ తలారి మల్లేష్ తదితరులు సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. కాగా, గుడిమల్కాపూర్ వైస్‌చైర్మన్‌గా షాబాద్ మండలానికి చెందిన కావలి చంద్రశేఖర్‌ను నియమించడంతో సీఎంను కలిసి సన్మానించి, శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు.



సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపిన చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాఘవేందర్‌గౌడ్

స్వామివివేకానంద జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

కులకచర్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్వామివివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. కులకచర్ల విజయచంద్ర ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12వ తేదీన వివేకానంద జయంతి సందర్భంగా యువజన ఉత్సవాలు ఈనెల 4వ తేదీన స్థానిక రామలింగేశ్వర కళాశాలలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, 6న ఘనపూర్ శివలింగేశ్వర ఆలయంలో యువజన సంఘాలకు కార్యక్రమాలు, 11న పరిగిలో స్వామివివేకానంద జీవిత చరిత్రపై ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పీఎస్‌పీఎస్ తాలూకా కోఆర్డినేటర్ కిరణ్‌గౌడ్, హరికృష్ణ, నిర్వాహకులు శివ, అంజనేయులు పాల్గొన్నారు.

రూ.207కోట్లు తాగేశారు!

(5వ పేజీ తరువాయి)

కంటే ఎక్కువగా బీర్ల అమ్మకాలు సాగాయి. పోయిన సంవత్సరం 1,77,814 కాటన్ బీరు అమ్మకాలు జరగ్గా, ఈ సారి మూడు రోజుల్లో 2,03,609 కాటన్లు అమ్ముడుపోయాయి. 2024 డిసెంబర్ 31న పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్తసంవత్సరాన్ని ఆహ్వానిస్తూ చేసుకున్న సంబరాలు ప్రభుత్వ ఖజానాను నింపాయి.

రంగారెడ్డి జిల్లాలో వంద కోట్లకు పైగా...

రంగారెడ్డి జిల్లాలో రూ.106.35 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అలాగే మేడ్చల్ జిల్లాలో రూ. 91.85 కోట్లు, వికారాబాద్ జిల్లాలో రూ.9.75కోట్ల అమ్మకాలు జరిగాయి. ఈ విక్రయాలు మూడు రోజుల్లో జరగడం విశేషం.

ఉమ్మడి జిల్లాలో 216 డ్రైంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

డిసెంబర్ 31 సందర్భంగా చాలామంది మద్యం తాగా రోడ్డెక్కారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 216 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 142 కేసులు నమోదు కాగా, వికారాబాద్ జిల్లాలో 35, మేడ్చల్ జిల్లాలో 36 కేసులు నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్ పోర్టు పరిధిలో 40 కేసులు నమోదు కాగా, ఇబ్రహీంపట్నంలో 24 కేసులు, చేవెళ్లలో 48 కేసులు, షాద్‌నగర్‌లో 30 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి.

అత్యధికంగా శేరిలింగంపల్లిలో..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లిలో అత్యధికంగా రూ.28.69 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అలాగే అత్యల్పంగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో రూ.1.13 కోట్లు విక్రయాలు సాగాయి. శేరిలింగంపల్లి తర్వాత స్థానంలో బాలానగర్ ఎక్సైజ్ డివిజన్‌లో రూ. 20.77 కోట్ల అమ్మకాలు జరిగాయి. అలాగే శంషాబాద్ డివిజన్‌లో రూ.20.82 కోట్ల అమ్మకాలు జరగగా, ఘట్‌కేసర్‌లో రూ.20.28 కోట్ల మద్యం కొనుగోళ్లు జరిగాయి.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 30 శాతం అధికంగా అమ్మకాలు

న్యూఇయర్ సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జోరుగా మద్యం అమ్మకాలు సాగాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్, మల్కాజిగిరి ప్రొహిబిషన్ జోన్‌లున్నాయి. మేడ్చల్ జోన్ పరిధిలో 114 మద్యం దుకాణాలు, 95 బార్లున్నాయి. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా రెండు రోజుల్లో 30, 31న 43 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబర్ నెల మొత్తం రూ.265 కోట్ల మద్యం విక్రయాలు జరగగా, కేవలం రెండు రోజుల్లోనే రూ.43 కోట్ల మద్యం అమ్మకాలు జరగడం గమనార్హం. గతేడాదితో పోలిస్తే రూ.6 కోట్లు (30 శాతం) అమ్మకాలు పెరిగినట్లు మేడ్చల్ ఎక్సైజ్ సూపరిండెంట్ ఎస్‌కె.ఫయాజ్ తెలిపారు. అదేవిధంగా మల్కాజిగిరి జోన్ పరిధిలో 88 మద్యం దుకాణాలు, 112 బార్లు ఉండగా.. డిసెంబర్ 30, 31న రూ.42.64 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబర్ నెల మొత్తం 224 కోట్ల మద్యం అమ్మకాలు జరుగగా కేవలం చివరి రెండు రోజుల్లో రూ.42.64 కోట్ల మద్యం అమ్మకాలు జరుగడం విశేషం.

కవయిత్రి మొల్ల విగ్రహ స్థాపనకు భూమిపూజ



తాండూరు రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారం గ్రామంలో కవయిత్రి మొల్ల విగ్రహ ఏర్పాటుకు కుమ్మరి సంఘం ప్రతినిధులు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ కుమ్మరి సంఘం రాష్ట్ర బాధ్యులు అంజయ్య, అధ్యక్షుడు కుమ్మరి పాండు, కార్యదర్శి అనంతయ్యలు మాట్లాడుతూ మొల్లమాంబ విగ్రహ స్థాపనకు గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వాల్మీకి సంస్కృత రామాయణ కావ్యాన్ని తెలుగులోకి అనువదించి రామాయణ విశిష్టతను సమాజానికి అందించిన తెలుగు తొలి కవయిత్రి మొల్లమాంబ కుమ్మర సామాజిక వర్గానికి చెందడం గర్వకారణమన్నారు. కుమ్మర సమాజానికి గుర్తింపు తెచ్చిన మొల్లమాంబ విగ్రహ స్థాపనకు తాండూరు మండలం అంతారం గ్రామ శివారులోని రైతు వేదిక వద్ద స్థలం కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కొంరెడ్డిపల్లి శాంతు, గ్రామస్తులు పుల్లారెడ్డి, కుమ్మరి సంఘం ప్రతినిధులు పాండు, శంకర్, అనంతయ్య, సత్యన్న, విఠల్ పాల్గొన్నారు.

ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో క్విజ్‌పోటీలు

పెద్దేముల్, జనవరి 01(ఆంధ్రజ్యోతి): ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన పాఠశాల విద్యార్థులకు మండలస్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్‌పార్టీ ఏబ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింహులు అన్నారు. మండలంలో గల వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని గొట్లపల్లి గేటువద్ద గల ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లో ఈ క్విజ్‌పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ నుంచి జనవరి వరకు జరిగిన ప్రతి సబ్జెక్ట్ సిలబస్‌లో నుంచి ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ బహుమతి రూ.5వేలు, మూడో బహుమతి రూ.2500లతో పాటు జ్ఞాపికలను అందజేయనున్నట్లు తెలిపారు. క్విజ్ పోటీల్లో పాల్గొనే వారికి భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మాజీ కౌన్సిలర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

తాండూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ స్వర్గీయ పెంటయ్య వర్ధంతిని బుధవారం పాత తాండూరు అంబేడ్కర్ పార్కు వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెంటయ్య పాత తాండూరు అభివృద్ధికి చేసిన కృషిని కాంగ్రెస్ నాయకులు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, బస్వరాజ్, కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, రాజ్‌కుమార్, సుధాకర్, సుభాష్, ప్రవీణ్ కుమార్, మల్లేశం, నరేందర్ పాల్గొన్నారు.



జంగారెడ్డికి ట్రైసైకిల్‌ను అప్పగిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట

కందుకూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో మెలగాలని, ప్రత్యేక రాష్ట్రం వచ్చాక బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అగర్‌మియాగూడ గ్రామ మాజీ ఉపసర్పంచ్ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ప్రజలు, నాయకులు మీర్‌పేటలోని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. అగర్‌మియాగూడకు చెందిన ఈర్లపల్లి జంగారెడ్డికి మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. నాయకులు జె. అంజిరెడ్డి, జయప్రకాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

తలకొండపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వరాలయంలో శ్రీ గోదాదేవి ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. బుధవారం అర్చకులు రామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

'స్పెషల్ శానిటేషన్' అంతంతే!

● ఆసుపత్రి ఎదుట పరిశుభ్రత.. వెనకాల అపరిశుభ్రత ● కేశంపేట పీహెచ్‌సీలో దుస్థితి..



ఆసుపత్రి వెనకాల పెరిగిన పిచ్చిమొక్కలు



హాస్పిటల్ ఎదుట శుభ్రంగా ఉన్న దృశ్యం

కేశంపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ అంటే ఇలాగే ఉంటుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చెత్తాచెదారం తొలగించారు. అయితే, ముందు శానిటేషన్ చేపట్టి వెనకాల విస్మరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. జిల్లాలో గురుకుల విద్యార్థులు విషజ్వరాలకు గురౌతున్న తరుణంలో కలెక్టర్ నారాయణరెడ్డి నవంబరు 21 నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉప ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ అధికారులు వారం రోజుల పాటు డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సానిటేషన్ డ్రైవ్ చేపట్టి చెత్తా చెదారం, కలుపు మొక్కలు తొలిగించి శుభ్రం చేశారు. అయితే, ఆసుపత్రి ముందు ప్రాంతం శుభ్రంగా దర్శనమిస్తుండగా.. వెనకాల మాత్రం అపరిశుభ్రంగానే ఉంది. ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలు మొలిచాయి. దాంతో పాములు, ఎలుకలు తిరుగుతున్నాయని, ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన వారు చెబుతున్నారు. అంతేకాకుండా కీటకాల బెడద ఎక్కువయ్యిందని చెబుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆసుపత్రి వెనకాల శుభ్రం చేయాలి

మండలాధికారుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టి చెత్తా చెదారం తొలిగించారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ, ఆసుపత్రి వెనకాల పిచ్చిమొక్కలు మొలిచాయి. దాంతో అక్కడ పాములు, ఎలుకలు తిరుగుతున్నాయి. దాంతో ఆస్పత్రి సిబ్బంది, చికిత్స నిమిత్తం వచ్చేవారు భయపడుతున్నారు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించాలి.

- సురేష్ మాదిగ, కోనాయపల్లి

మాదృష్టికి రాలేదు

కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసుపత్రి ఆవరణలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టి చెత్తాచెదారం, కలుపు మొక్కలు తొలగించాం. ఆసుపత్రి వెనకాల పిచ్చిమొక్కలు పెరిగిన విషయం మా దృష్టికి రాలేదు. పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో బిజీగా ఉన్నారు. వారం రోజుల్లో ఆసుపత్రిలో సానిటేషన్ చేపడతాం.

- రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీడీవో, కేశంపేట

ఊరూవాడా నూతన వత్సర వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- న్యూఇయర్ వేడుకలకు స్వాగతం పలుకుతూ ఇళ్ల ముంగిట ముగ్గులు
- ఒకరికొకరు శుభాకాంక్షల వెల్లువ



శంషాబాద్ రూరల్ : ఇంటి ఎదుట ముగ్గు వేస్తున్న బాలిక



ఆమనగల్లు : వేంకటేశ్వరాలయంలో భక్తుల పూజలు



షాద్‌నగర్ అర్బన్ : చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు



చేవెళ్ల : వేంకటేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



షాబాద్ : నాగర్‌గూడ శ్రీకృష్ణ మందిరంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/శంషాబాద్ రూరల్/శంషాబాద్/షాద్‌నగర్ అర్బన్/చేవెళ్ల/మొయినాబాద్/షాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు ఊరువాడా అంబరాన్నంటాయి. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకొన్నారు. యువతీ యువకులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం అర్ధరాత్రి 2024కి వీడ్కోలు పలికి 2025కు సంవత్సరానికి స్వాగతం పలికారు. పలు చోట్ల కేక్‌లు కట్ చేసి యువకులు సందడి చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఫోన్ల ద్వారా ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బుధవారం తెల్లవారుజామునే మహిళలు, యువతులు ఇళ్ల ముందు ముగ్గులేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలతల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మైసమ్మ దేవతను పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. శంషాబాద్ మండల పరిధిలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నర్కూడ అమ్మపల్లి శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో భక్తులు రికార్డు స్థాయిలో వచ్చారు. సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో భక్తులు బారులు తీరారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊట్‌పల్లి శృంగేరి శంకర మఠం, సిద్దులు గుట్ట శివాలంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువత బైకులపై గల్లీల్లో తిరిగి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. కాగా, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆర్జీఐఏ, శంషాబాద్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వివిధ బస్తీల్లో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. సుప్రసిద్ధ శ్రీ వెండికొండ సిద్దేశ్వరస్వామి (సిద్దులగుట్ట), ధర్మగిరి ధర్మసాయి దేవాలయం, శక్కరి మఠం శివాలయం, కట్టమైసమ్మ, పోచమ్మ దేవాలయం తదితర దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు రంగురంగుల ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. షాద్‌నగర్ పరిధిలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామిని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, కౌన్సిలర్లు ఈశ్వర్‌రాజు, మహేశ్వరి, పి.లతా శ్రీశైలంగౌడ్, ఆలోనిపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు దర్శించుకున్నారు. చేవెళ్లలోని వేంకటేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మొయినాబాద్‌లోని చిలుకూరు బాలాజీ దేవాలయం, కనకమామిడిలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబీకులు స్వామి వారిని దర్శించుకున్నారు. షాబాద్ కొత్త సంవత్సరం కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం.. అంతా మంచే జరగాలని ఆకాంక్షిస్తూ షాబాద్ మండల ప్రజలు మండల కేంద్రంలోని రామాలయం, నాగర్‌గూడలోని శ్రీకృష్ణ మందిరం, సీతారాంపూర్‌లోని శ్రీరామచంద్రస్వామి ఆలయం, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈమేరకు ఉదయం నుండే బారులు తీరారు.

ఎమ్మెల్యేలకు నాయకుల శుభాకాంక్షలు



ఇబ్రహీంపట్నం : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న చిలుక మధుసూదన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం/యాచారం/శంషాబాద్ రూరల్/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/కేశంపేట/కొత్తూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పరిధిలో నూతన సంవత్సర వేడుకలు ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని త్రిశక్తి దేవాలయం, శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాల్లో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కాగా మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నం పరిధిలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 24 కేసులు నమోదైనాయి. యువత కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ యాచారం మండలాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ సభ్యులు నర్సింహ, ఎండీ అక్బర్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు తిరుమలేషతో పాటు పలువురు నాయకులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శంషాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు నీరటి రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నార్సింగ్ ఏఎంసీ మాజీ ఛైర్మన్ దూడల వెంకటేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ అనేగోని శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి దంపతులు ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తిరుపతి రెడ్డిని రేవంత్ మంత్రి మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ, ఉపాధ్యక్షుడు లింగంపల్లి ఆనంద్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, గట్ల కేశవ రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, భట్టు కిషన్ రెడ్డి, బొజ్జ సాయి రెడ్డి, సూదిని కొండల్ రెడ్డి, డాక్టర్ శ్రీను, జగన్, కృష్ణనాయక్, బాబా, నర్సింహ, విజయ్‌రాథోడ్, అనితవిజయ్, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్‌లు మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌లను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ మల్లు రవిని ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు బికుమాండ్ల రమేశ్ లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె. శివచారి తదితరులు ఉన్నారు. అలాగే కేశంపేట మండల బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్‌ను కలిశారు. మండల వైస్ ప్రెసిడెంట్ కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో హైదరాబాద్ వెళ్లి తెలంగాణ భవన్‌లో కేటీఆర్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఊరడి శ్రీనివాస్, గౌతపురం శ్రీకాంత్ గౌడ్, ఎండి యాకుబ్, ఎండీ ఆసిఫ్, అరవింద్ ప్రజాపతి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : ఎమ్మెల్యే శంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విశాలశ్రవణ్ రెడ్డి దంపతులు

వృత్తి నైపుణ్య శిక్షణతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన



పథకాన్ని ప్రారంభిస్తున్న రాఘవేందర్ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. దేశంలో మరేరాష్ట్రంలో లేని విధంగా ఫోర్త్ సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో పాటు రాష్ట్రంలోని పలుప్రాంతాలలో వృత్తి నైపుణ్యశిక్షణ కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శంకర్‌కొండ తండాకు చెందిన మండ్లీ నర్సింహ ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాన్ని బుధవారం డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి , జిల్లా కాంగ్రెస్ నాయకుడు మండ్లీ రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి టాస్క్ సీవోవో రాఘవేందర్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగ, ఉపాధి కల్పనకు రాష్ట్రప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, జిల్లా, మండల నాయకులు కాలె మల్లయ్య, రచ్చ శ్రీరాములు, అంజి, ఈశ్వర్, చంద్రునాయక్, కృష్ణ, లక్ష్మణ్, ఖాదర్, కరీం, శివలింగం, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

● **తలకొండపల్లి :** గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటుచేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 62వ రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దీక్షలో జేఏసీ నాయకులు, యువకులు, గ్రామ నేతలు కూర్చున్నారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ ఛైర్మన్ అశోక్ గౌడ్, వైస్‌ఛైర్మన్ శరత్ చంద్ర, ఆంజనేయులు గౌడ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రం ఏర్పాటు విషయంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవ తీసుకోవాలని అన్నారు. లేని యెడల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు పేర్కొన్నారు. మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాండు, లక్ష్మీపతి, రాజు నాయక్, నరేశ్ నాయక్, సురేశ్,చంద్రయ్య, చెన్నయ్య, ముత్యాలు, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

● **తలకొండపల్లి :** మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం లక్ష్మమ్మ మృతదేహాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలంలు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి శ్రీనివాస్ రెడ్డి రూ.4 వేలు, ప్రభాకర్ రెడ్డి రూ.3వేలు, శ్రీశైలం రూ.3వేలు వ్యక్తిగతంగా ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందలా చూస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అదేవిధంగా మాదాయిపల్లి గ్రామానికి చెందిన ముత్యాలు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు మృతుడి కుటుంబానికి శ్రీనివాస్ రెడ్డి రూ. 5వేలు, ప్రభాకర్ రెడ్డి రూ.3వేలు ఆర్థికసాయం అందజేశారు.

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని ఏడవ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్ రాజు ముద్రించిన 2025 సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆవిష్కరించారు. ఈశ్వర్ రాజు కుమారుడు భద్రినాథ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయం వద్ద అయ్యప్పలకు భిక్షను ఏర్పాటు చేశారు. అంజయ్యయాదవ్, మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్‌లు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కౌన్సిలర్లు ఈశ్వర్‌రాజు, కొందూటి మహేశ్వరి, పి. లతశ్రీశైలంగౌడ్, ఆలోనిపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు

మహేశ్వరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం రాత్రి మహేశ్వరం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. యూపీకి చెందిన దీప్‌చంద్రకుమార్ (22), మనోజ్‌కుమార్(23)లు మండల పరిధిలోని మంఖాల్ పారిశ్రామిక వాడలోని ఓ కంపెనీలో పని చేస్తుంటారు. బుధవారం వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై కందుకూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి తుమ్మలూరు రెవెన్యూ మ్యాక్ ప్రాజెక్టు వద్ద ఎదురుగా వస్తున్న కారు వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దాంతో దీప్‌చంద్రకుమార్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్ర గాయాలపాలైన మనోజ్ కుమార్‌ను నగరంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు అచ్చంపేటకు చెందిన పెద్ద కొత్తపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్‌దిగా పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు దొంగ అరెస్ట్.. రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో కారును దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. కడప జిల్లాలోని పొద్దుటూరు తాలూకా.. శంకరపురం గ్రామానికి చెందిన పుల్లిభద్రి అలియాస్ మహేష్ షాద్‌నగర్‌లో అడ్డా కూలీగా పని చేసేవాడు. డిసెంబరు 23న భిక్షపతి గౌడ్ అనే వ్యక్తి తన కియా కారును విజయ్‌నగర్ కాలనీలోని అతడి రియల్‌ఎస్టేట్ ఆఫీస్ ఎదుట పార్క్ చేసి ఇంటికి వెళ్లాడు. ఆ కారును మహేష్ దొంగిలించాడు. మరుసటి రోజు బాధితుడు ఫిర్యాదు చేయగా.. విచారణ చేసి ఏపీలో అతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడు గతంలో షాద్‌నగర్, చటాన్‌పల్లి గ్రామాల్లోని పలు ఇళ్లలో దొంగతనం చేసినట్లు తెలిపారు. అతడి నుంచి కారుతో పాటు 5 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

సీఎం రేవంత్ చొరవతో నియోజకవర్గానికి మహర్దశ

ఆమనగల్లు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చొరవ, ప్రభుత్వ సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గానికి మహర్దశ ఏర్పడిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. నగర శివారున, ఫోర్త్ సిటీని అనుసరించి ఉన్న ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం వేగంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనితవిజయ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కల్లు రమణారెడ్డిలతో కలిసి ఏర్పాటు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వెనుకబాటుకు గురైన కల్వకుర్తి నియోజకవర్గాన్ని వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వివిధ పథకాల కింద చేపట్టి అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను ప్రారంభించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో రహదారుల అభివృద్ధి, ఆధునీకరణకు రూ.500 కోట్లతో కార్యాచరణ రూపొందించడం జరిగిందని నారాయణ రెడ్డి వివరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, నాయకులు తదితరులు ఉన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

కడ్తాల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): విద్య, క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం నుంచి నిర్వహించే గూడూరు నారాయణ రెడ్డి స్మారక కడ్తాల ప్రీమియర్ లీగ్-3 క్రికెట్ టోర్నమెంట్ పోటీల విజయవంతంపై బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. టోర్నమెంట్‌కు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. టోర్నీ ప్రారంభ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. పోటీలలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, టోర్నమెంట్ ఆర్గనైజర్ అనిల్ గౌడ్, నిర్వాహకులు తదితరులున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కడ్తాల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ప్రజలను మోసగించడం అనాదిగా కాంగ్రెస్ నైజమని ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంలో బుధవారం 2025నూతన సంవత్సర క్యాలెండర్లను మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కడారి రామకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్లు జోగు వీరయ్య, సేవ్యానాయక్‌లతో కలిసి దశరథ్ నాయక్ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి కేక్‌కట్ చేశారు. నాయకులు హరిచంద్ నాయక్, మంగళపల్లి నర్సింహ, పాండు నాయక్, శ్రీను నాయక్, భీమన్, శ్రీను, రాజు, శ్రీకాంత్, సక్రు, మోతిలాల్, వినోద్, రతన్, లక్ష్మణ్, చందర్, బీక్యా, అంజి, తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్లు మంజూరు చేయండి

షాద్‌నగర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలో నాణ్యమైన విద్యుత్‌ను అందిచేందుకు కొత్త సబ్ స్టేషన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. ఈ మేరకు బుధవారం ప్రగతిభవన్‌లో భట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లేడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహడ్, మల్కాపహడ్, కొందుర్గు మండలంలోని మహదేవ్‌పూర్, చెరుకుపల్లి, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చింతగూడెం, ఎలికట్టలకు 33/11 కేవీ సబ్ స్టేషన్లను మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరగా సానుకూలత వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

ప్రేమ పేరిట జీవితాలను పాడు చేసుకోవద్దు

షాద్‌నగర్ అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువత జీవితాలను పాడుచేసుకోవద్దని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. షాద్‌నగర్‌కు చెందిన జర్నలిస్టు ఖాజాపాషా.. ప్రేమలో విఫలమైన యువకుడిగా నటించిన ప్రతిశ్వాసలో నువ్వేనని అనే పాటను బుధవారం స్థానిక మొబైల్ అడ్డాలో ఎమ్మెల్యే శంకర్ విడుదల చేశారు.